# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ:  02-05-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి  నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో ఈరోజు పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.
- వయోజనుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము తెలిపారు.
- ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు ప్రజాస్వామ్య దేశాలు కలిసి ముందుకు రావాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పిలుపునిచ్చారు.
- WAVES 2025 సదస్సు మొదటి రెండు రోజుల్లో వివిధ రంగాలలో 254 కోట్ల రూపాయల విలువైన వ్యాపార లావాదేవీలను నమోదు చేసింది.

======================

ప్రధానమంత్రి  నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో ఈరోజు పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ముందుకు వెళుతోందని, వికసిత్ భారత్‌కు ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. అమరావతి ఒక నగరం కాదని.. ఒక శక్తి అని, యువత కలలు సాకారమయ్యే రాజధానిగా ఎదుగుతుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలుగా దేశం భౌతిక, డిజిటల్, సామాజిక, మౌలిక సదుపాయాలపై విస్తృతంగా దృష్టి సారించిందని అన్నారు. మౌలిక వసతుల కల్పనతో భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. దాదాపు 60 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశామని, ఇవి ఆంధ్రప్రదేశ్ ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనమన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు కేరళలోని తిరువనంతపురం సమీపంలో 8 వేల 900 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన విజింజం ఇంటర్నేషనల్ డీప్‌వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఈ అంతర్జాతీయ ఓడరేవుతో కేరళలో ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, షిప్పింగ్‌లో భారత పాత్రను గణనీయంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబైలో జరుగుతున్న WAVES 2025 మొదటి రెండు రోజుల్లో సంగీతం, యానిమేషన్, రేడియో, VFX రంగాలలో 254 కోట్ల రూపాయల విలువైన వ్యాపార లావాదేవీలను నమోదు చేసిందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ సమ్మిట్‌కు ఇంకా రెండు రోజులు మిగిలి ఉన్నందున, ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ రేపు ముంబైలో WAVES 2025 కార్యక్రమంలో పాత్రికేయ, వినోద రంగంపై గణాంక హ్యాండ్‌బుక్ 2024-25ను విడుదల చేయనుంది. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడే సేవా రంగంలో మీడియా, వినోదం ఒక ముఖ్యమైన భాగం అని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ రంగం 2027 నాటికి 3 వేల బిలియన్ రూపాయలకు చేరుకోవడానికి 7 శాతం వృద్ధితో అభివృద్ధి చెందుతుందని అంచనా వేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

వయోజనుల అనుభవాలు, జ్ఞానం యువతరానికి మార్గదర్శకం అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం జరిగిన 'ఏజింగ్ విత్ డిగ్నిటీ' కార్యక్రమానికి రాష్ట్రపతి హాజరయ్యారు. కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ పోర్టల్, సీనియర్ సిటిజన్స్ హోమ్‌లను రాష్ట్రపతి వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని అన్నారు. వృద్ధుల ఆనందం, శ్రేయస్సు కోసం తమను తాము అంకితం చేసుకోవాలని సూచించారు. వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. వయోజనులు గతానికి వారధి లాంటివారని, భవిష్యత్‌కు మార్గదర్శకులని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ దేవాలయాన్ని ఈరోజు తెరిచారు. ఉదయం 7 గంటలకు వేద మంత్రోచ్చారణల మధ్య ఈ అలయం ద్వారాలను తెరిచారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామీ హాజరయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో హెలికాప్టర్ ద్వారా భక్తులపై పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో బద్రీనాథ్, కేదార్‌నాథ్ దేవాలయాల అధికారులు, కమిటీ సభ్యులు, పూజారులతో పాటు వేద పండితులు పాల్గొన్నారు. కాగా “చార్ ధామ్ యాత్ర”లో భాగంగా కేదార్‌నాథ్ దేవాలయం ఈరోజు తెరుచుకోగా, గంగోత్రి, యమునోత్రిలను అక్షయ తృతీయ సందర్భంగా ఏప్రిల్ 30వ తేదీన తెరిచారు. ఇక బద్రీనాథ్ దేవాలయాన్ని ఈనెల 4వ తేదీన తెరవనున్నారు. కేదార్‌నాథ్ యాత్ర కోసం సోన్ ప్రయాగ్ నుంచి హెలికాప్టర్ సేవలు ఇప్పటికే ప్రారంభమైనాయి. కేదార్‌నాథ్‌కు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. దేవాలయ అధికారులతో పాటు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా భారీగా భద్రతా బలగాలను మోహరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదం ప్రపంచానికి తీవ్ర సవాలును కలిగిస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. దీనిని నిర్మూలించేందుకు అన్ని ప్రజాస్వామ్య దేశాలు కలిసి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని జపాన్ ప్రతినిధుల సభ స్పీకర్ ను ఫుకుషిరో నేతృత్వంలోని జపాన్ పార్లమెంటరీ ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో ఓం బిర్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, ప్రజాస్వామ్య సమాజాల విలువలను నిలబెట్టడానికి ఆయా దేశాలు పరస్పర విశ్వాసం, అంతర్జాతీయ నిబంధనల పట్ల గౌరవం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై భారత్, జపాన్ దేశాలు కలిసి పని చేస్తాయన్నారు. ఇరు దేశాల పరస్పర సంబంధాలు ప్రయోజనకరమైన పురోగతికి, అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి స్థిరత్వానికి దోహదపడతాయన్నారు. జపాన్‌లోని వివిధ రంగాలలో భారతదేశంలోని 50 వేలకు పైగా నైపుణ్యం కలిగిన వారికి అవకాశాలను కల్పించాలన్న జపాన్ ప్రతిపాదనను స్పీకర్ ఈ సందర్భంగా ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశం గత 10 సంవత్సరాలలో దాదాపు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో “భారతదేశం.. ది ల్యాండ్ ఆఫ్ ఎక్స్‌పోనెన్షియల్ గ్రోత్” అనే అంశంపై 14వ సెమినార్‌ను కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత్ సరైన సామర్థ్యం, అవసరమైన మౌలిక సదుపాయాలు, బలమైన మార్కెట్‌ను కలిగి ఉందని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికతకు దేశంలోని ప్రతి రంగం దోహదపడతాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధారణంగా ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 242 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 259 పాయింట్ల లాభంతో 80 వేల 501 వద్ద ముగిసింది. నిఫ్టీ 12 పాయింట్ల లాభంతో 24 వేల 346 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =